సాహసమంచు

సీరియల్

ముద్దా సురేష్

(రెండవ భాగము)

రెండుగోడల అంచులు, పొడుచుకువచ్చిన శిలలతోనూ, పిట్లవేళ్ళతోను నిండుకుని వున్నాయి.

అవతలివైపు గోడకు చేరుకోవటం,

అదీ—అతిత్వరగా—చేరుకోవడం మాత్రమే సమస్య.

ఏదో ఆలోచన వచ్చి, అతనిని ఎవరో ఝళ్ళున కొరడాతో కొట్టినట్లయింది.

రెండుగోడలుగా చీలిపోయిన భూమి మళ్ళీ దగ్గరకి అతుక్కుపోతే!?

అడకత్తెరలో పోకచెక్కలా....

తల విదిలించాడు రాణా.

త్వరగా ఏదో చేయాలి!

పగులులో చిక్కుకుపోయిన తన కారు మాత్రమే అవతలివైపు వెళ్ళడానికి బ్రిడ్జిలా సహాయపడగలదు.

ఒకటి.... రెండు.... గెంతులు.... అంతే!

తను అవతలివైపు వుంటాడు.

ఆ ప్రయత్నం చాలా ప్రమాదకరమైనది....

కాని మరో మార్గమేదీ?

దడదడలాడే గుండెలతో, నెమ్మదిగా కారు పైకప్పు మీద అడుగుమోపాడు రాణా.

ఇట్సాల్ రైట్.

అది కదలడంలేదు.

తన బరువునంతా కారు పైభాగంమీద మోపాడు రాణా యింకా—అదే గోడనుపట్టుకు వేలాడుతూ.

సున్నితమైన కారు టాప్ మీద తన కాలు జారితే??

అతని వెన్నెముకలోంచి చలి పెట్టుకొచ్చింది. మొండి ధైర్యంలో, రాణా. అవతలి గోడను వదిలిపెట్టి, కారు

టాప్ మీంచి ఛెంగున అవతలికి గెంతాడు. అంతే!

అప్పటిదాకా గోడను ఆనుకునివున్న కారు, పట్టుసడలి క్రిందికి కూలిపోసాగింది, రాణాని వెంట తీసుకుపోతూ!!

క్రిందికి జారిపోతూ, గాభరాగా, అవతలి గోడను చేతులతో తడిమాడు రాణా.

అదృష్టవశాత్తు అతని చేతికి బలమైన వేరు తగిలింది.

ఆ వేరుకు వేలబడుతుండగా కారు దడదడా శబ్దం చేస్తూ అగాధంలో కూలిపోయింది.

రాణా చెమటతో తడిసి ముద్దయ్యాడు.

కారు కూలిపోతున్న శబ్దానికి ఉలికిపడి పసిపాప క్రిందికి చూసింది.

అంతే! వ్రేలాడుతున్న రాణాని చూసి—భయంగా కేకలు పెట్టసాగింది....

ఆమెకాళ్ళకి తగిలిన మట్టిపెళ్ళలు చెదిరిపోయి కెర టాల్లా క్రిందికి దొర్లసాగాయి.

"భయ్యా....భయ్యా...."

ఆమె వికృతంగా ఏడ్వసాగింది.

నిరాధారంగా వ్రేలాడుతున్న తన కాళ్ళకి గోడలో వున్న ఓ గట్టిరాయి తగల్డంతో నిట్టూర్పు విడిచాడు రాణా, బరువును దానిపై మోపుతూ.

దుమ్ముతో కలుషితమైన గాలిని ఊపిరితిత్తుల్లోకి నింపు కుంటూ పాపవైపు చూసాడతను.

"బేబీ!" అరిచాడు రాణా "ఘబ్రావ్ మత్. అలాగే పట్టుకుని వుండు. నీ దగ్గిరకి వస్తున్నాను."

తన మాటలు ఆమె వినిపించుకుందో, లేదో అతనికి తెలీదు. ఆమె ఎంతోసేపు అలా చావుకీ, బ్రతుక్కీ మధ్య వ్రేలాడలేదన్న విషయం మాత్రం తెల్సు రాణాకి.

అతను చేతులతో ఆధారంకోసం తడుముకుంటూ, ఏటవాలుగా, గతుకులుగా చీలివున్న ఆ గోడపైకి మెల్లగా ప్రాకసాగాడు.

ఆమెకు ఎనిమిది అడుగుల దూరంలో వుండగా, రాణాకి గట్టి రాతి నేల తగిలింది కాళ్ళకి ఆధారంగా.

బహుశా, ఉపరితలం నుండి సహాయం రావచ్చు. చీలికలో చిక్కుకుపోయిన వారిని రక్షించడం కోసం ఎవరో ఒకరు ప్రయత్నించక మానరు.

పసిపాపను చేరుకునే మార్గంకోసం ఆతురతగా వెతికాడు రాణా.

ఆమె నిలబడ్డ మట్టిపొరకు నాలుగడుగుల క్రిందుగా, గోడలో సన్నని లోతైన చీలిక క్రిందకంటూ వుంది.

రాణా, పాదాల్ని బలంగా ఆ చీలికలో గుచ్చుతూ అటూ ఇటూ వున్న రాళ్ళను చేత్తో పట్టుకుంటూ పాప నిలబడ్డ చోటుకు చేరసాగాడు.

పాప, తలదించి అతనికేసి బెదిరిపోతూ గాభరాగా చూసింది....

దుమ్ముకొట్టుకుపోయిన తన ముఖాన్ని చూసి ఆమె భయపడ్తోందనుకున్నాడు రాణా.

"బేబీ! ఇంకేం ఫర్వాలేదు. కదలొద్దు. నిన్ను జాగ్రత్తగా బైటికి చేరుస్తాను. ఓ.కే.? కదలకు!"

అమె బిత్తరపోతూ అతని ఆకారాన్ని చూస్తూ కాళ్లు విదిలించసాగింది కదిలే ప్రయత్నంలో.

"కదలక!" అర్చాడు కోపంగా.

అంతే! ఏడుస్తున్న ఆమె చేతిపట్టు సడలింది.

కెవ్వున అరుస్తూ గాలిలో జారిపోతున్న ఆమె, గౌనుని ఒకచేత్తో పట్టుకున్నాడు రాణా.

తటాలున ఆమెని భుజంమీదకి లాక్కున్నాడు. ఆ హఠాత్పరిణామానికి జడిసిపోయిన పాప వికృతంగా ఏడ్వసాగింది....

రాణా అలాగే నిలబడిపోయి, ఆమెను ఓదార్చసాగాడు.

రెండు నిమిషాల తర్వాత పాప ఏడుపు తగ్గింది.

రాణా సూచన పాటిస్తూ ఆ పాప అతని మెడచుట్టూ చేతులు వేసి, నడుంచుట్టూ కాళ్లు పెనవేసి అతన్ని అల్లుకుపోయింది.

"వెరీగుడ్, కొన్ని నిముషాల్లో చూడు నిన్ను యెలా పైకి చేరుస్తానో" అన్నాడు రాణా, తనకులేని ధైర్యాన్ని ఆమెకి యిస్తూ.

రాణాకి అకస్మాత్తుగా మెదడులో శూన్యం ప్రవేశించింది. అలసట తగ్గి ఓపిక తిరిగి ప్రవేశించినట్లయింది. ఊపిరి సాధారణ స్థాయిలోకి వచ్చింది.

వీపుమీద పాప రోదన సన్నగా వినబడుతోంది.

రాణా పైకి చూశాడు సూర్యకాంతి వైపు....చావగా మిగిలివున్న వాళ్ళని రక్షించడానికి యింకా యెవరూ ముందుకు రాలేదు.

తను చావుని తప్పించుకున్నాడు.

దేనినుండి??

దాని నేమనాలి?

ఆ ప్రశ్న రాణా మెదడులో సమ్మెటదెబ్బలా తగలసాగింది....

యాక్సిడెంటా?

భూకంపమా?

భారత దేశంలో భూకంపాలు చాలా తక్కువ.

భూకంపాలు ఏర్పడినా, అవి చాల తక్కువ సేపు....

దీన్ని యేమనాలి?

భూమి యిలా రెండు చెక్కలుగా విడిపోడాన్ని....

ఇలాంటిది ఏ దేశంలోనయినా జరిగిందా?

ఇంపాసిబుల్!

అసహజం!

నమ్మరానిది!!

కాని....కాని....తన కళ్ళెదురుగా జరిగింది.

ఎందుచేత?

ఈ మారుమూల ప్రదేశంలోనే యెందుకు జరగాలి? ఖుల్నా ప్రాంతంలో జరుగుతున్న మిలటరీ ప్రయోగాలు దీనికి కారణమా?

వాళ్ళు భూగర్భంలో బాంబులు ప్రయోగాలు చేయడము వల్ల....యిలా జరిగిందా?

కాని ఆ ఆలోచన అసహజంగా తోచింది రాణాకు. ప్రజలు మసిలే ప్రాంతాలలో బాంబు ప్రయోగాలు యెందుకు జరుపుతారు?

మానవ సంచారంలేని—ఎడారి ప్రాంతం బోలెడంత వుండగా.

అయినా అనుమానం పోలేదు రాణాకు.... సరిగ్గా అప్పుడే....

కాళ్ళదగ్గర యేదో కదలికను గ్రహించాడు రాణా.

మొదట అది క్రిందకు రాలుతున్న దుమ్మూ ధూళి అనుకున్నాడు. కాని అది అగాధంలోంచి పైకి వస్తున్నట్లు గ్రహించాడు.

గిరిగిరాలు తిరుగుతూ పైకి వస్తోంది.... మేఘంలా వున్న ఆ పొగ కొంచెం పసుపుఛాయలో వున్నట్లుంది.

కాని క్రింద చీకటివల్ల రాణాకు నిర్ధారణ కాలేదు
మెల్లగా, గట్టింపవుతున్న, ఆ విచిత్రమైన మేఘం....
క్రమంగా....ఆ అగాధమంతటినీ కమ్ముకోసాగింది....

అతని ఛాతీని ముసురుతూ, ఆ విచిత్ర మేఘం పసిపాపను తిమిరించి పైకి కదలసాగింది.

భూగర్భంలో పొగ యేమిటి?

పాప అకస్మాత్తుగా దగ్గసాగింది.

ఆమె తలయెత్తి, పొగకేసి విచిత్రంగా చూసింది.... పాపను మెల్లగా పైకెత్తాడు రాణా, తన తలకు సమానస్థాయిలో.

అప్పటికి ఆ పొగమంచు అతని ముక్కు పుటాల్ని సోకింది....ఆదోరకం వాసన వేస్తోంది ఆ పొగ.

అతను గోడ బొరియలోంచే వంగిచూశాడు దానివైపు

ఏమిటది?

పొగ యెలా వచ్చింది?

గాస్ అనుకోవాలా?

కాదేమో. గాస్‌కి సాధారణంగా రంగు వుండదు.

కాని అది మేఘంలా దట్టంగావుంది. దానికో ఆకారము ఉంది....

పసువురంగుగా వుంది....వాసన కొంచెమే అయినా పదునయిన వాసన.

అయోమయంగా ఆలోచిస్తోన్నాడు రాణా.

అండర్‌గ్రౌండ్ విడిపోవడంవల్ల ట్రాప్ అయిన ఆవి పదార్థమేదో బయటపడి వుండాలి. ఇప్పుడు దారి ఏర్పడ్డ చేత, అది బయటికి ప్రయాణిస్తూ వుండాలి.

ఆ మేఘం అతని తలమీద ఉన్నప్పుడు. దానిగుండా బయటకి చూడ్డం కష్టంగావుంది రాణాకి.

ఏదో అనుమానంవచ్చి కంపించిపోయాడు రాణా.

ఇంతకుముందు జరిగిన దారుణాంకంకంటె ఈ భాగమంచు మరీ ప్రమాదకరమైనదేమో?

"రక్షించండి."

"కోయీ హై ఉధర్?"

"ఎవరక్కడ?"

రాణా పొలికేక. ఆ అగాధంలో ప్రతిధ్వనించింది అవహేళనగా.

....ప్చ్....జవాబులేదు.

"పాపా! మనం పైకి వెళ్తున్నాం. నన్ను గట్టిగా పట్టుకో...." అన్నాడు రాణా నిర్ధారణగా.

"నాకు....నాకు....భయ్యా కావాలి....బాలూ...."

"నాకు తెలుసమ్మా. కానీ మమ్మీ, డాడీ నీ కోసం బయట ఎదురు చూస్తూ వుంటారు. నామాట వినాలి మరి...."

తల్లిదండ్రులు జ్ఞాపకం రాగానే ఆమె, కన్నీళ్ళతో అతని భుజంమీద ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్వ సాగింది.

ఆమెను ఓదార్చుతూ హెచ్చరికచేసి మెల్లగా పైకి కదిలాడు రాణా.

వీపుమీద కొత్తగా ఏర్పడ్డ బరువుతో,

రాణా భయం భయంగా పైకి పాకుతుండగా పసుపు రంగుపొగ, అతని ముఖాన్ని పూర్తిగా కమ్మేసి, గింగుర్లు తిరుగుతూ, నెమ్మదిగా వున్న ఉపరితలంవైపు ప్రయాణించ సాగింది........

* * *

"రక్షించండి!"

అన్న రాణా పొలికేక పైన వున్న కొంతమందికి విన బడింది....ఆ భయంకరమైన అగాధంలో కూలిపోయిన వాళ్ళెవరూ బ్రతికి బైటపడే అవకాశంలేదని నిశ్చయించుకున్న ప్రజలకి రాణా ఆర్తనాదం, ఆశ్చర్యాన్ని కలిగించింది.

అంతకు ముందే, తన పిల్లలకోసం పిచ్చాడిలా ఏడుస్తూ ఓ యిన్‌స్పెక్టర్, సగం కూలిపోయిన యిళ్ళనీ, శిథిలమైన పాపుల్నీ, అగాధపు టంచుల్నీ కలయతిరిగాడు. తర్వాత తెగించి—ఓ. తాడు సహాయంతో లోపలికి దిగాడుకూడ.

కాని అతనికి ఎవరూ కనబడలేదు.

లోపల ఏమీ కనబడలేదు—అంధకారం తప్ప—

నిరుత్సాహంగా బైటికి వచ్చిన ఇన్‌స్పెక్టర్‌కి అప్పుడే వినబడింది రాణా ఆర్తనాదం!

తాడు నడుంకి బిగించి, మళ్ళీ లోపలకి దిగాడు ఇన్‌స్పెక్టర్, అక్కడి ప్రజల సహాయ సహకారాలతో.

రెండు నిముషాలయింది....

వారంతా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు....

మూడు....

నాలుగు....నిముషాలు బరువుగా గడిచాయి....

అయిదో నిముషం తర్వాత ఒగురుస్తూ బైటపడ్డాడు యిన్‌స్పెక్టర్, చేతిలో స్పృహతప్పిన పాపతో!

అతను నేలపై పాపను పడుకోబెట్టాడు.

డాక్టర్‌ని పిల్చుకురమ్మని కంగారుగా జనానికి చెప్పి, కన్నీళ్ళతో, ఆతురతగా పాప మొహాన్ని ముద్దులతో ముంచేసాడు.

ఉలిక్కిపడి ఇన్‌స్పెక్టర్ మళ్ళీ వెనక్కి వెళ్ళాడు.

తాడు సహాయంతో మళ్ళీ లోనికి దిగాడు.

ఈసారి అతను ఓ వ్యక్తిని సాయంచేస్తూ బైటికి తీసుకొచ్చాడు—ఆ గాఢంలోంచి.

ఆ వ్యక్తి ముఖంనుండి, కాళ్ళదాకా మట్టి కొట్టుకుని పోయి వున్నాడు.

దుమ్ము కొట్టుకుపోయి భయంకరంగా కనబడుతున్న ఆ వ్యక్తి కేకలు పెడుతూ, వేగంగా అరుస్తున్నాడు....

"నన్ను పోనీండి! అక్కడే బాగుంది నాకు! హాహా హా" అంటూ హఠాత్తుగా, అతను వెనక్కి తిరిగి రివ్వున ఆ గాఢం వేపు పరిగెత్తాడు....

నలుగురు గ్రామస్తులు మెరుపులా కదిలి అతన్ని బలంగా ఒడిసి పట్టుకున్నారు.

పిచ్చివాడైన ఆ వ్యక్తే రాణా!

* * *

చీలికలోంచి పుట్టుకొస్తున్న ఆ విచిత్రమైన పొగని, గ్రామ ప్రజలు తిలకించారు, ఆశ్చర్యంగా.

దొంతర్లు దొంతర్లుగా వెలువడుతోంది ఆ పొగ....

ఆ పొగ మధ్యగా చిన్నగా ఏదో మెరుస్తోంది! సూర్య రశ్మి దానిగుండా ప్రసరించడంవల్ల అలా మెరుస్తోందని భావించారు వారంతా.

వేగంగా ఆ పొగ పైకిలేచి ఆకాశంవైపు ప్రయాణిస్తూ దట్టమైన, పసుపు పచ్చని మేఘంగా మారిందని!

ఏదో బాంబు ప్రేలిన తర్వాత ఏర్పడే పొగలా వుందని.

ఆ గాఢంలో మిగిలివున్న పొగ, కుక్కగొడుగు ఆకారంలో పైకి లేస్తూ, పసుపు మేఘంలో కల్సిపోయి ఆకాశంలో ప్రయాణించసాగింది....

ఆ శిథిలమైన గ్రామానికి దూరంగా....

గాలి, ఆ మేఘాన్ని దూరంగా నెట్టివేయగానే అందరూ ఆ విషయం గురించి తాత్కాలికంగా మర్చిపోయారు.

* * *

స్వామి కేశవానంద్ జీ—బరువెక్కిన హృదయంతో, తల దించుకుని పొలాలమ్మట అడుగులేస్తున్నాడు....

ఆజానుబాహువైన విగ్రహం ఆయనది....

శాంత గంభీరవదనం....

కాషాయ వస్త్రాలు ధరించాడు....

ఆ చుట్టుప్రక్కల గ్రామీణ ప్రజలు, ఆయన ఉపన్యాసాలు విని తన్మయులౌతూంటారు....

అర్ధనిమీలిత నేత్రాలతో, ఆయనతో పాటు భజన గీతాలు ఆలాపిస్తూ, ఐహిక దుఃఖాల్ని మరుస్తుంటారు....

ఆయన సన్నిధి వారికి ఓదార్పు....

స్వామీజీ అంటే వారికి భక్తి, గౌరవం....ప్రాణం! సదా నిర్మలాకాశంలా ప్రశాంతంగా వుండే ఆయన మోములో, ఆ రోజు విషాదపు మబ్బులు ముసురుకుని వున్నాయి....

పక్క గ్రామంలో జరిగిన దారుణ సంఘటన ఆయన్ని కలవర పెడుతోంది....

దాన్ని గురించే తీవ్రంగా ఆలోచిస్తున్నాడాయన.... వారం రోజులుగా, అక్కడి భూకంపం గురించి, వార్తా పత్రికల్లో పడుతోంది....

కాని ఈ రోజుల్లో ఒకరి బాధలు, మరొకరు పట్టించుకొనే దెవరు?

ప్రక్క గ్రామపు ప్రజలు, తన గ్రామవాసులకి-పొరుగు వారు.

భారత దేశంలో మిగతా ప్రజలకి—వాళ్ళు మరోచోట నివసించే పౌరులు మాత్రయే.

ఒకరి సమస్యను పట్టించుకోనే తీరిక ఎక్కడిది ఈనాటి మానవుడికి?

ఎవరి జీవితం వారిది....

ఎవరి సమస్యలు వారివి....

ఈరోజు సంతోషిమా ఆలయంలో ఆ విషయంపైనే తను ఉపన్యసించబోతున్నాడు.

స్వామీజీ అకస్మాత్తుగా తలెత్తి చూసాడు.

తను—ఓ విచిత్రమైన పొగమంచులోకి నడిచినట్లు గ్రహించాడు.

పొగమంచు, ఈ కాలంలో సహజమే.

కాని యిది యిలా వుందేమిటి?

దట్టంగా.... వెడల్పుగా....

తన ముఖంమీద పోతున్నప్పుడు మరీ దట్టంగా....

దృష్టి కనబడనీయకుండా....

ఓ విచిత్రమైన వాసనకూడా?—

సంతోషిమాతా!

ఆలయంలో ని సేవలకు జాగు అవుతుందేమో?

సూర్యుడుదయించి యింత సేపైనా, ఇంకా పొగమంచేమిటి?

తలెత్తి, పైకి చూసాడు స్వామీజీ.

సూర్యుడి ఉనికి బలహీనంగా కనబడుతోంది, ఆయన్ని చుట్టుముట్టిన దట్టమైన పొగమంచులోంచి.

గుడ్డిగా ముందుకు నడవసాగాడు స్వామీజీ.

తను నడిచే మార్గం సరైనదో కాదో తెలియదు అతనికి.

"సంతోషిమా! నేను దారి తప్పాను" గొణుక్కు-న్నాడు స్వామీజీ, ఎదురుగా తనవైపే వస్తున్న నల్లని ఆకారంవైపు చూస్తూ.

ఆ ఆకారం తనంత ఎత్తుగా లేదు....

బలంగా లావుగా వుంది....

ఏవిటది?

నిశ్శబ్దంగా వస్తోంది తనవైపే....

యిప్పుడు?

ఓహ్! భగవాన్! మరో ఆకారం....యింకొకటి....మరోటి వాటిని కల్సింది....తనమీదకే వస్తున్నాయి.

స్వామీజీ భయంగా చూస్తూ వెనక్కి నడవసాగాడు.

అతని నోరు, తెరుచుకుంటూ మూసుకుంటోంది శబ్దం లేకుండా....

అతను వేగంగా నడవసాగాడు వెనక్కి తిరక్కుండా.

క్రమక్రమంగా ఎక్కువౌతున్న తన పైకి వస్తున్న ఆ ఆకారాలమీంచి దృష్టి మళ్ళించడాన్కి భయంగా వుంది....

ఉన్నట్టుండి అతను వెనక్కు దేనికో గుద్దుకున్నాడు... స్వామీజీ తూలిపడిపోతూ వెనక్కి చూసాడు-భయంగా.

అతన్ని గుద్దుకున్న నల్లటి ఆకారం అతనివేపే సూటిగా చూస్తోంది....

నవ్వాడు స్వామీజీ!

కళ్ళలో నీళ్ళు నిలిచేదాకా పగలబడి నవ్వాడు.

తన పిరికితనానికి, తనే ఆశ్చర్యపోతూ విరగబడి నవ్వాడు.

తను గేదెల మందలోకి నడిచాడు!! అంతే!

స్వామీజీ మామూలు మనిషి కావడానికి అయిదు

నిముషాలు పట్టింది.

ఆ గేదెల యజమాని భైరవ్.

వాడు పగలబడి నవ్వుతాడు, తానీ అనుభవాన్ని చెప్పి నప్పుడు.

నేలమీద ఎగురుతున్నట్టు ఆ గేదెలు అలా కనబడ్డంతో ఆశ్చర్యంలేదు.

పొగమంచు విపరీతంగా వుంది!

గేదెల కాళ్ళు తనకు కనబడలేదు.

అవును. తనో గుణపాఠం నేర్చుకున్నాడీ రోజు.

తెలియనిదేదైనా, భయంకరంగా వుంటుంది, వాస్త వానికంటే.

స్వామీజీకి మరో అయిదు నిముషాలు పట్టింది పొగ మంచులోంచి బైటపడి, ఆలయాన్కి దారి వెతుక్కో డాన్కి.

* * *

ఆకుల చప్పుడు విని, కాలా చటుక్కున పొదల వెనక దాక్కున్నాడు.

మనిషా?

జంతువా?

తను చాలా జాగ్రత్తగా వుండాలి. అనుకున్నాడు కాలా.

మాజీ మిలటరీ మేజర్ విశ్వనాథ్ తోట అది.

ఆ తోటలో రకరకాల పక్షుల్నీ, జంతువుల్నీ పెంచు తాడు విశ్వనాథ్. నెమళ్ళు, పావురాలు, కోళ్ళు, మొద లైన వెన్నో.

ఒకసారి తను, పావురాల్ని దొంగిలిస్తూ దొరికిపోయాడు. అప్పుడు మేజర్ విశ్వనాథ్ తనని ఈడ్చుకుంటూ లాక్కెళ్ళి

యింట్లో కొట్టిన కొరడా దెబ్బల తాలూకు మచ్చలు ఇంకా తన వీపుమీద వున్నాయి. మరోసారి తోటలో అడుగు పెడితే పోలీస్ స్టేషన్‌కి అప్పగించి, చితగ్గొడతానన్నాడు.

కాని ఈసారి తను ఆ ముసలాడికి దొరకడు. క్రిందటి సారి తోటలో ఎక్కువసేపు తిరుగుతూ వుండడంవల్ల దొరికిపోయాడు.

ఈ రోజు విశ్వనాథ్ మేడలో హడావుడిగా వుంది. పట్నంనుంచి కార్లు వస్తున్నాయి. ఏదో పార్టీ వున్నట్టుంది.

అందుకే తన చేతిలో వున్న నెమలిపిల్లతో సంతోషించలేదు కాలా.

ఆ నెమలి పిల్లని పాతిక రూపాయలకి అమ్ముకోవచ్చు కాని తాను ఆ సమాను దొంగతనానికి రావడం ప్రమాదం. అందుకే యింకో దాన్ని దేనినైనా చేజిక్కించుకుని పారిపోవాలి.

తోట యజమానిని తిట్టుకుంటూ, పొదల్లోంచి గుడ్లగూబలా బైటికి చూశాడు కాలా.

అంతే!

అతని ఒళ్ళు జలదరించింది.

అవును!

అక్కడేదో వుంది.

మనిషి కాదు.

మరో నెమలిపిల్ల అక్కడ దాక్కుని ఉందేమో?

చప్పుడు చేయకూడదు.

బెదిరిపోతుంది.

ఆ ముసలి వెధవ తోటలో యిలాంటివి ఎన్నో వున్నాయి.

పది నిమిషాల పాటు నిశ్చలంగా అలాగే వుండి

పోయాడు కాలా.

ఉలికిపడి వెనక్కి చూసాడు కాలా.

విచిత్రమైన పొగ—తనను మునుపటిలా కప్పేసిందని గ్రహించి విసుబోయాడు.

కాలాకి ఎంతో ఆశ్చర్యమేసింది. ఆ తోటలో అలాంటి పొగమంచుని ఎప్పుడూ చూడలేదతను.

ఏది ఏమైనా అవతలి పొదలో వున్న జంతువు బైటికి వచ్చేవరకూ—కదలకూడదని నిశ్చయించుకున్నాడు.

రెండు నిముషాలయింది....

అప్పటికే నేలమీది ఆ విచిత్రమేఘం అతన్ని దాటుకుంటూ అవతలి పొదవైపు కదిలింది—తేలుకుంటూ.

సరిగ్గా అప్పుడే—

ఆ పొదలోంచి ఏదో చర్రున పారిపోయిన అలికిడి....

"ఛలేగయీ సాకీ!" కసిగా తిట్టుకుంటూ పైకి లేచాడు కాలా.

అసహనంగా నేలను తన్నాడు.

చేతిలోని బంధించబడ్డ నెమలిపిల్ల వైపు ఓసారి చూసాడు.

ఏదీ లేనిదానికంటే, దొరికినదాంతో సంతృప్తిపడ్డం ఉత్తమం—

కాలా వెనక్కి తిరిగాడు.

పొగ మంచులోంచి నడుచుకుంటూ వెళ్ళాడు. బైటికి దారి అతనికి బాగా తెలుసు.

పొగమంచు అతన్ని ఏమీ చేయలేదు.

కళ్ళకు గంతలుకట్టినా తనదారి తాను వెతుక్కోగలడు.

(ఇంకావుంది)